ఉత్తరం
TG TEL/25/A1234
www.kakatiyanews.com
# కాకతీయ
గురువారం, 24 సెప్టెంబర్ 2026 | సంపుటి: 02 | సంచిక: 37 | పేజీలు: 4 | వెల: 5



## విద్య, వైద్యం అందించే వారికే ఓటు వేయాలి

- పశ్చిమలో ఎమ్మెల్యే నాయినినా.. ఆయన అల్లుడా
- ఆంధ్ర నుంచి వచ్చి తెలంగాణలో బెదిరింపులు
- ఎంజీఎం ఘటనపై నాయిని ప్రజలకు సమాధానం చెప్పాలి
- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు దుగ్గంపూడి రంజిత్‌రెడ్డి

4

# తెలుగు రాష్ట్రాలకు భారీ వర్ష సూచన

- కళింగపట్నం సమీపంలో తీవ్ర వాయుగుండం రాత్రి తీరం దాటే అవకాశం
- 50–70 కి.మీ వేగంతో ఈదురుగాలులు
- ఉత్తరాంధ్రలో 4 జిల్లాలకు రెడ్ అలర్ట్
- తీరప్రాంతాలకు ఫ్లాష్ ఫ్లడ్స్ ముప్పు
- తెలంగాణలో అతి భారీ వర్షా లకు హెచ్చరిక
- వరంగల్, ఖమ్మానికి ఆరెంజ్ అలర్ట్

**కాకతీయ, తెలంగాణ బ్యూరో:** బంగాళాఖాతంలో కొనసాగుతున్న తీవ్ర వాయుగుండం ప్రభావంతో తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. పశ్చిమ మధ్య, వాయువ్య బంగాళాఖాతంలో కేంద్రీకృతమైన తీవ్ర వాయుగుండం గత 6 గంటల్లో గంటకు 5 కి.మీ వేగంతో కదులుతోందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. ప్రస్తుతం గోపాల్‌పూర్‌కు 150 కి.మీ, కళింగపట్నానికి 50 కి.మీ, పూరీకి 250 కి.మీ, విశాఖపట్నానికి 120 కి.మీ దూరంలో కేంద్రీకృతమై ఉన్నట్లు పేర్కొంది. బుధవారం రాత్రికి విశాఖపట్నం-గోపాల్‌పూర్ మధ్య కళింగపట్నం సమీపంలో తీరం దాటే అవకాశం ఉందని తెలిపింది. కళింగపట్నం సమీపంలో బుధవారం రాత్రి 8 నుంచి 12 గంటల మధ్య తీవ్ర వాయుగుండం తీరం దాటే అవకాశం ఉందని విశాఖ తుపాను హెచ్చరికల కేంద్రం తెలిపింది. తీరం దాటే సమయంలో 50-70 కి.మీ వేగంతో ఈదురుగాలులు వీస్తాయని, తీర ప్రాంతాల్లో ఫ్లాష్ ఫ్లడ్స్ వచ్చే అవకాశం ఉందని హెచ్చరించింది. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. కళింగపట్నం, విశాఖపట్నం, కాకినాడ, గంగవరం పోర్టుల్లో మూడో నంబర్ ప్రమాద హెచ్చరిక జారీ చేశారు.

**ఉత్తరాంధ్రకు రెడ్ అలర్ట్**

శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి జిల్లాలకు బుధవారం రెడ్ అలర్ట్ జారీ అయింది. విశాఖ, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ ఇచ్చారు. ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, నంద్యాల, కర్నూలు, అనంతపురం జిల్లాలకు ఎల్లో అలర్ట్ ప్రకటించారు. గురువారం అల్లూరి, ఏలూరు జిల్లాలకు రెడ్ అలర్ట్, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ, పార్వతీపురం మన్యం, అనకాపల్లి జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు.

**తెలంగాణలోనూ భారీ వర్షా లు**

తీవ్ర వాయుగుండం ప్రభావం ....(తరువాయి 2లో)



# గణేశ్ నిమజ్జనానికి భారీ బందోబస్తు!

## 20 వేల మంది పోలీసులతో భద్రతా ఏర్పాట్లు

- 24 డ్రోన్లు.. 10 వేల సీసీ కెమెరాలతో నిఘా
- హుస్సేన్‌సాగర్ చుట్టూ 100 హైరైజ్ కెమెరాలు
- ఖైరతాబాద్.. బాలాపూర్ శోభాయాత్రలకు ప్రత్యేక భద్రత
- డీజేలు.. వల్గర్ డ్యాన్సులు.. ఫేక్ వీడియోలపై కఠిన చర్యలు




**కాకతీయ, తెలంగాణ బ్యూరో :** గణేశ్ నిమజ్జన శోభాయాత్రలకు హైదరాబాద్ సిద్ధమైంది. శుక్రవారం జరిగే సామూహిక నిమజ్జనాలను ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీసుశాఖ భారీ బందోబస్తు ఏర్పాటు చేసింది. వేలాది విగ్రహాలు నిమజ్జనం కానున్న నేపథ్యంలో నగరవ్యాప్తంగా భద్రతను కట్టుదిట్టం చేసినట్లు సీపీ సజ్జనర్ తెలిపారు. 20 వేల మంది హైదరాబాద్ పోలీసులు, ఇతర జిల్లాల నుంచి 8,400 మంది సిబ్బంది బందోబస్తులో పాల్గొంటారని వెల్లడించారు. ఖైరతాబాద్, బాలాపూర్ శోభాయాత్రలకు ప్రత్యేక భద్రత కల్పిస్తున్నట్లు చెప్పారు. ఈసారి గణేశ్ వేడుకల పర్యవేక్షణకు ఏఐ సాంకేతికతను వినియోగిస్తున్నట్లు సీపీ తెలిపారు. 24 డ్రోన్లు, దాదాపు 10 వేల సీసీ కెమెరాలను కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానించారు. హుస్సేన్‌సాగర్ చుట్టూ 100 హైరైజ్ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేశారు. ట్రాఫిక్, హైడ్రా, జలమండలి, అగ్నిమాపక, విద్యుత్ శాఖలు సమన్వయంతో పనిచేయనున్నాయి. చైన్‌స్నాచింగ్, చోరీలను అడ్డుకునేందుకు 25 ప్రత్యేక క్రైమ్ టీమ్‌లు, మహిళల భద్రత కోసం షీటీమ్‌లు రంగంలో ఉంటాయని సజ్జనర్ తెలిపారు.

**శోభాయాత్రలపై ఆంక్షలు**

నిమజ్జనం కోసం 15 వేలకు పైగా దరఖాస్తులు వచ్చాయని అధికారులు తెలిపారు. పీపుల్స్ ప్లాజా, నెక్లెస్‌రోడ్డులో క్రేన్లు, పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. బాలాపూర్ గణేశ్ శోభాయాత్ర సుమారు 18 కిలోమీటర్ల మేర సాగనుంది. ప్రధాన శోభాయాత్ర మార్గాల్లో ప్రైవేటు వాహనాలకు అనుమతి ఉండదని స్పష్టం చేశారు. 25న ప్రైవేటు బస్సులను నగరంలోకి అనుమతించబోమన్నారు. ట్యాంక్‌బండ్, నెక్లెస్‌రోడ్డుపైకి ఇతర వాహనాలకు అనుమతి ఉండదని జాయింట్ సీపీ జోయల్ డేవిస్ తెలిపారు. విమానాశ్రయం, రైల్వేస్టేషన్లకు వెళ్లేవారు ముందుగానే బయలుదేరాలని ........(తరువాయి 2లో)

# రెండు డీఏల ప్రకటనపై భిన్న స్వరాలు

## దసరాకు ఒకటి.. ఉగాదికి మరోటి అంటూ ప్రచారం

- ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోలేదంటున్న టీఎన్జీవో, టీజీవో
- డీఏలపై సానుకూలంగా స్పందించిన లచ్చిరెడ్డి
- చర్చలు విఫలమయ్యాయన్న టీజీఈజేఏసీ
- డీఏలపై ఉద్యోగుల్లో దడ.. సంఘాల్లో చీలిక
- స్పష్టమైన జీవోలు ఇవ్వకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరిక



**కాకతీయ, తెలంగాణ బ్యూరో :** తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగుల డీఏల వ్యవహారం మరోసారి చర్చనీయాంశంగా మారింది. సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఆరు డీఏల్లో రెండు మాత్రమే ఇచ్చేందుకు ప్రభుత్వం సుముఖంగా ఉందంటూ వెలువడిన సమాచారం ఉద్యోగుల్లో తొలుత ఆనందాన్ని కలిగించినా.. కొద్దిగంటల్లోనే గందరగోళానికి దారితీసింది. సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజుతో ఉద్యోగ సంఘాల నేతల సమావేశం అనంతరం దసరాకు ఒక డీఏ, వచ్చే ఏడాది ఉగాదికి మరో డీఏ ఇస్తారనే ప్రచారం జరిగింది. అయితే ప్రభుత్వం ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదని టీఎన్జీవో, టీజీవో సంఘాల నేతలు స్పష్టం చేయడంతో అసలు పరిణామం ఏమిటన్నదానిపై ఉద్యోగుల్లో ఉత్కంఠ నెలకొంది. మరోవైపు రెవెన్యూ ఉద్యోగుల సంఘం మాత్రం ప్రభుత్వం రెండు డీఏల విషయంలో సానుకూలంగా స్పందించిందని ప్రకటించగా.. టీజీఈజేఏసీ నేతలు చర్చలు విఫలమయ్యాయని వెల్లడించడం ఉద్యోగ సంఘాల మధ్య భిన్నాభిప్రాయాలను బయటపెట్టింది.

**రెండు డీఏలపై భిన్న ప్రకటనలు**

చీఫ్ సెక్రటరీతో సమావేశం అనంతరం రెండు డీఏలకు ...(తరువాయి 2లో)

## సీఎం రేవంత్‌కు రైతుల గోస కనిపించదా?

- వర్షా కాలంలో ఉపాధి హామీ పనులా..
- నీళ్లు లేక పంటలు ఎండిపోతున్నా పట్టించుకోరా?
- సాగునీరు అందక వందల ఎకరాలు బీడుగా మారుతున్నాయి
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



4

## మాజీ ఎమ్మెల్యే వినయ్ భాస్కర్‌పై కేసు

- ఎంజీఎంలో పోలీసులకు విధులకు ఆటంకం
- దాడికి పాల్పడ్డారంటూ ఎస్ఐ బి.శ్రీనివాస్ ఫిర్యాదు
- ఎంజీఎం ఆస్పత్రి ఘటనలో కీలక పరిణామం

4

# మళ్లీ కరెంట్ కోతలు

- సంక్షోభంలో విద్యుత్ రంగం
- రైతులపై కరెంట్ కోతల భారం
- సింగరేణిలో 40 లక్షల టన్నుల బొగ్గు మాయమైంది
- నాసిరకం బొగ్గుతో రూ.2,900 కోట్ల నష్టం
- 4,000 మెగావాట్ల యాదాద్రిలో 400 మెగావాట్లే ఉత్పత్తి
- 6 పవర్ స్టేషన్లకు బీఆర్ఎస్ బృందాలు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**కాకతీయ, తెలంగాణ బ్యూరో :** తెలంగాణలో విద్యుత్ రంగం సంక్షోభంలో కూరుకుపోయిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా కరెంట్ కోతలు విపరీతంగా పెరిగాయని అన్నారు. కేసీఆర్ హయాంలో రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అందించామని, రేవంత్‌రెడ్డి పాలనలో మళ్లీ పాత రోజుల పరిస్థితులు వచ్చాయని విమర్శించారు. వనరుల నిర్వహణలో తీవ్ర వైఫల్యం, ఆర్థిక నిర్వహణలో లోపాల కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలోనే కాంగ్రెస్ వస్తే కరెంట్ కోతలు తప్పవని హెచ్చరించామని, ఇప్పుడు అదే పరిస్థితి కనిపిస్తోందన్నారు. విద్యుత్ సమస్యపై బీఆర్ఎస్ తీవ్రంగా పోరాడుతుందని స్పష్టం చేశారు.

**బొగ్గు నిల్వలపై భిన్న ప్రకటనలు**

సింగరేణిలో బొగ్గు నిల్వలు ........(తరువాయి 2లో)





## రిమ్స్‌లో ఘటనలో ఐదుకు చేరిన చిన్నారుల మృతి

- చికిత్స పొందుతూ మరో ఇద్దరి మృతి
- ప్రమాద కారణాలపై కొనసాగుతున్న సమగ్ర విచారణ
- భద్రతా ఏర్పాట్లపై టీజీహెచ్ఆర్‌సీ సీరియస్
- అక్టోబర్ 27కు తదుపరి విచారణ

**కాకతీయ, ఆదిలాబాద్ :** ఆదిలాబాద్ రిమ్స్ ఆస్పత్రిలోని ప్రత్యేక నవజాత శిశు సంరక్షణ విభాగం (ఎస్ఎన్‌సీయూ)లో సోమవారం అర్ధరాత్రి జరిగిన అగ్నిప్రమాదం తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. ఇప్పటికే ముగ్గురు నవజాత శిశువులు మృతి చెందగా.. చికిత్స పొందుతున్న మరో ఇద్దరు పసికందులు కూడా ప్రాణాలు కోల్పోయారు. దీంతో మృతుల సంఖ్య 5కు చేరింది. తాజాగా మృతి చెందిన ఇద్దరూ ప్రీటర్మ్ శిశువులని అధికారులు తెలిపారు. ఎస్ఎన్‌సీయూలో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో దట్టమైన పొగ వ్యాపించింది. ప్రమాద సమయంలో సుమారు 27 మంది శిశువులు చికిత్స పొందుతున్నట్లు రిమ్స్ వర్గాలు తెలిపాయి. వైద్యులు, నర్సులు, ఇతర సిబ్బంది, అగ్నిమాపక సిబ్బంది కలిసి శిశువులను అత్యవసరంగా బయటకు తరలించారు. పలువురిని రిమ్స్‌తో పాటు ఇతర ఆస్పత్రులకు తరలించి చికిత్స అందించారు. ప్రాథమిక సమాచారాన్ని బట్టి ఏసీ యూనిట్‌లో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ ........(తరువాయి 2లో)

# రెండు డీఏల ప్రకటనపై భిన్న స్వరాలు

(మొదటిపేజీ తరువాయి)

సంబంధించిన ప్రతిపాదన కేబినెట్ ముందుకు వెళ్తుందని ప్రచారం జరిగింది. దసరాకు మొదటి డీఏ, ఉగాది నాటికి రెండో డీఏ ఇస్తారని కొందరు నేతలు ప్రకటించడంతో ఉద్యోగుల్లో ఆశలు పెరిగాయి. అయితే టీఎన్జీవో, టీజీవో సంఘాల నేతలు మాత్రం రెండు డీఏలు ఖరారయ్యాయని చెప్పలేమని స్పష్టం చేశారు. కేవలం రెండు డీఏల అంశాన్ని కేబినెట్ ముందు ప్రతిపాదిస్తామని సీఎస్ చెప్పారని, తుది నిర్ణయం తీసుకోలేదని వారు పేర్కొన్నారు. దీంతో ప్రభుత్వ వైఖరిపై ఉద్యోగుల్లో స్పష్టత కరువైంది.

**3.64.. 2.74 శాతంపై లచ్చిరెడ్డి ప్రకటన**

రెవెన్యూ ఉద్యోగుల సంఘం చైర్మన్ లచ్చిరెడ్డి మాత్రం సమావేశం అనంతరం సానుకూలంగా స్పందించారు. మొదటి డీఏగా 3.64 శాతం, రెండో డీఏగా 2.74 శాతం ఇచ్చేందుకు ప్రభుత్వం అంగీకరించిందని ఆయన వెల్లడించారు. పీఆర్సీ కమిటీ నివేదిక వచ్చిన వెంటనే తదుపరి నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ పరిణామం లక్షలాది మంది ఉద్యోగులకు తక్షణ లబ్ధి చేకూర్చే అంశమని పేర్కొన్నారు. ఉద్యోగుల సంక్షేమం కోసం సంఘం చేసిన ప్రయత్నాలు ఫలించాయని చెబుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, సీఎస్ సంజయ్ జాజీలకు కృతజ్ఞతలు తెలిపారు.

**'చర్చలు విఫలమయ్యాయి'.. టీజీఈజేఏసీ**

టీజీఈజేఏసీ మాత్రం దీనికి భిన్నమైన వైఖరిని ప్రకటించింది. ప్రభుత్వంతో జరిగిన చర్చలు విఫలమయ్యాయని టీజీఈజేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు తెలిపారు. ఉద్యోగులు ఎదుర్కొంటున్న నాలుగు ప్రధాన సమస్యల్లో ఏ ఒక్కదానిపైనా స్పష్టమైన హామీ రాలేదని వారు చెప్పారు. ఒకటి, రెండు డీఏలతో ఉద్యోగుల సమస్యలు పరిష్కారం కావని, ప్రభుత్వం సమగ్రంగా స్పందించాల్సి ఉందని పేర్కొన్నారు. చర్చలు ఉద్యోగులకు స్పష్టమైన భరోసా ఇవ్వలేకపోయాయని అసంతృప్తి వ్యక్తం చేశారు.



**పెండింగ్ బిల్లులపై ప్రతిష్ఠంభన**

ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న బిల్లులను గతంలో మాదిరిగా నెలకు రూ.2 వేల కోట్ల విలువ మేర చెల్లించాలని కోరినప్పటికీ ప్రభుత్వం అందుకు అంగీకరించలేదని టీజీఈజేఏసీ నేతలు తెలిపారు. ప్రస్తుతం రూ.1,000 కోట్ల మేర మాత్రమే చెల్లింపులు చేయగలమని అధికారులు చెప్పినట్లు వెల్లడించారు. దీనివల్ల ఉద్యోగులకు పెద్దగా ఆర్థిక ఊరట లభించదని వారు పేర్కొన్నారు. పీఆర్సీ నివేదికను ఇప్పటి వరకు తెప్పించకపోవడంపైనా వారు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఒకటి, రెండు నెలల్లో నివేదిక వస్తుందని చెప్పడం కాలయాపనకు దారితీస్తుందని విమర్శించారు.

**సీపీఎస్‌పై స్పష్టత ఏది?**

కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) రద్దు అంశంపైనా ఉద్యోగ సంఘాలు ప్రభుత్వాన్ని ప్రశ్నించాయి. సీపీఎస్ స్థానంలో నూతన విధానం తీసుకురావడానికి కమిటీ ఏర్పాటు చేస్తామని చెప్పినా.. దానికి ఎలాంటి కాలపరిమితి ప్రకటించలేదని నేతలు తెలిపారు. ఇప్పటివరకు అధికారికంగా కమిటీ ఏర్పాటు కాలేదని పేర్కొన్నారు. ముఖ్యంగా 2024 సెప్టెంబర్ 1 నాటికి నియమితులైన ఉద్యోగుల విషయంలో స్పష్టత లేకపోవడంపై ఆందోళన వ్యక్తం చేశారు. ఈ అంశంపై ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**జీవోలు రాకుంటే ఆందోళనలు**

ప్రభుత్వం ఏకపక్షంగా వ్యవహరిస్తే భవిష్యత్తులో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని టీజీఈజేఏసీ నేతలు హెచ్చరించారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో తాము వెనక్కి తగ్గబోమని స్పష్టం చేశారు. పెండింగ్ బిల్లులు, పీఆర్సీ, సీపీఎస్, డీఏలపై స్పష్టమైన నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. ముఖ్యమంత్రి నేరుగా హామీ ఇవ్వాలని టీఎన్జీవో, టీజీవో సంఘాల నేతలు డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. కేవలం ప్రకటనలతో కాకుండా స్పష్టమైన జీవోలు విడుదల చేయాలని కోరారు.

**సంఘాల్లో బయటపడిన విభేదాలు**

చీఫ్ సెక్రటరీతో సమావేశం అనంతరం ఉద్యోగ సంఘాల మధ్య భిన్నాభిప్రాయాలు స్పష్టంగా బయటపడ్డాయి. రెండు డీఏలపై రెవెన్యూ ఉద్యోగుల సంఘం సానుకూలంగా స్పందించగా.. టీజీఈజేఏసీ నేతలు మాత్రం ప్రధాన సమస్యలపై స్పష్టత రాలేదని చెబుతున్నారు. పెండింగ్ బిల్లులు, పీఆర్సీ, సీపీఎస్ వంటి అంశాలపై భిన్న స్వరాలు వినిపిస్తున్నాయి. రాబోయే రోజుల్లో అన్ని సంఘాలను కలుపుకుని భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తామని టీజీఈజేఏసీ వెల్లడించింది. ఉద్యోగుల డిమాండ్లపై ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయాలు తీసుకుంటుందా? లేక సంఘాల ఆందోళనలు మరింత ఉధృతమవుతాయా? అన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

## రిమ్స్ విషాదంపై నెల రోజుల్లో చర్యలు తీసుకోవాలి

- ఐదుగురు పసికందుల మృతికి ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణం
- ప్రభుత్వ ఆసుపత్రుల పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి
- బాధిత కుటుంబాలకు న్యాయం జరిగే వరకు పోరాటం
- తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత



**కాకతీయ, ఆదిలాబాద్ :** రిమ్స్ ఆసుపత్రిలో ఏసీ పేలుడు ఘటనలో ఐదుగురు పసికందులు ప్రాణాలు కోల్పోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత అన్నారు. నెల రోజుల్లోగా ప్రభుత్వ ఆసుపత్రుల పెండింగ్ బిల్లులు విడుదల చేయడంతోపాటు గిరిజన గూడేలకు రహదారి సదుపాయాలు కల్పించాలని, కేంద్రం నుంచి వచ్చిన నిధుల వివరాలను వెల్లడించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి నెల రోజుల గడువు విధిస్తున్నట్లు ప్రకటించారు. బుధవారం ఆదిలాబాద్‌లోని రిమ్స్ ఆసుపత్రిని సందర్శించిన కవిత, ఘటనలో గాయపడి సురక్ష చిల్డ్రన్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారులను పరామర్శించి వారి కుటుంబాలకు ఓదార్పు తెలిపారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. రిమ్స్‌లో ఐదుగురు పసికందులు మృతిచెందిన ఘటనపై ప్రభుత్వం బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. అయితే, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఘటనపై స్పందించకపోవడం, బాధితులను పరామర్శించేందుకు రాకపోవడం దారుణమని విమర్శించారు. కాగా, అధికారిక సమాచారం ప్రకారం రిమ్స్ ఘటనలో మృతుల సంఖ్య ఐదుకు చేరింది.

**150 ఏసీలు.. మెకానిక్ లేరా**

రిమ్స్‌లో సుమారు 150 ఏసీలు ఉన్నప్పటికీ వాటి నిర్వహణకు మెకానిక్ లేకపోవడంపై కవిత ప్రశ్నించారు. ఆసుపత్రిలో మౌలిక వసతులు, సిబ్బంది కొరత ఉన్నాయని, ఆరోగ్యశ్రీ కింద సుమారు రూ.500 కోట్ల బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని ఆమె ఆరోపించారు. ఆసుపత్రులకు అవసరమైన నిధులు కేటాయించకపోతే ప్రభుత్వ వైద్య వ్యవస్థ ఎలా పనిచేస్తుందని ప్రశ్నించారు. నెల రోజుల్లో సమస్యలను పరిష్కరించకపోతే ఆదివాసీలతో కలిసి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా ఘెరావ్ చేపడతామని కవిత హెచ్చరించారు. గిరిజన ప్రాంతాల్లో రహదారులు, వైద్య సదుపాయాలు మెరుగుపరచాలని కోరారు. కేంద్ర నిధుల వినియోగంపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. రిమ్స్ ఘటనతో ప్రభుత్వ వైద్య సేవల్లో ఉన్న లోపాలను గుర్తించి వెంటనే సరిదిద్దాల్సిన అవసరం ఉందని కవిత అన్నారు. ఆసుపత్రులకు నిధులు, సిబ్బంది, నిర్వహణ వ్యవస్థను బలోపేతం చేయాలని కోరారు. బాధిత కుటుంబాలకు న్యాయం జరిగే వరకు తన పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

## తెలుగు రాష్ట్రాలకు భారీ వర్ష సూచన



(మొదటిపేజీ తరువాయి)

తెలంగాణపైనా కనిపించనుంది. బుధవారం అతి భారీ వర్షాలు, గురు, శుక్రవారాల్లో అతి నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. వరంగల్, ఖమ్మం, పెద్దపల్లి, సూర్యాపేట జిల్లాలకు బుధవారం ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, మహబూబ్‌నగర్‌తో పాటు నిజామాబాద్, నల్గొండ జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు ప్రకటించింది. దీంతో తెలంగాణలో లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన పరిస్థితి నెలకొంది.




## రిమ్స్‌లో ఘటనలో ఐదుకు చేరిన చిన్నారుల మృతి

(మొదటిపేజీ తరువాయి)

కారణంగా సమస్య తలెత్తి మంటలు వ్యాపించినట్లు అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అయితే ప్రమాదానికి అసలు కారణం ఏమిటన్నది విచారణ పూర్తయిన తర్వాతే తేలనుంది. ఫైర్ సేఫ్టీ పరికరాలు, ఏసీ యూనిట్, విద్యుత్ వైరింగ్ నిర్వహణపైనా ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

**పొగ ప్రభావంతోనే మృతులా?**

తాజాగా మృతి చెందిన ఇద్దరిలో ఒకరు ఇందర్వెల్లి మండలం దుబ్బగూడకు, మరొకరు కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా లింగాపూర్ మండలానికి చెందినవారని అధికారులు తెలిపారు. ప్రమాద సమయంలో వ్యాపించిన దట్టమైన పొగ, విషపూరిత వాయువులు శిశువుల శ్వాసకోశంపై ప్రభావం చూపినట్లు వైద్యులు ప్రాథమికంగా భావిస్తున్నారు. అయితే ప్రతి శిశువు మృతికి సంబంధించిన వైద్య కారణాలను అధికారిక నివేదికలు నిర్ధారించాల్సి ఉంది. ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందించనున్నట్లు వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ప్రకటించారు. బతికిన శిశువులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. అవసరమైతే హైదరాబాద్‌లోని ప్రత్యేక ఆస్పత్రులకు తరలించేందుకు చర్యలు చేపట్టారు.

**టీజీహెచ్‌ఆర్‌సీ సుమోటో**

రిమ్స్ అగ్నిప్రమాదంపై ఎలక్ట్రికల్, ఫైర్ సేఫ్టీ, స్ట్రక్చరల్ అంశాలపై సమగ్ర ఆడిట్‌కు ప్రభుత్వం ఆదేశించింది. ఇదే సమయంలో మీడియా కథనాలను ఆధారంగా చేసుకుని తెలంగాణ మానవ హక్కుల సంఘం (టీజీహెచ్‌ఆర్‌సీ) సుమోటోగా కేసు స్వీకరించింది. ప్రమాద పరిస్థితులు, ఎస్ఎన్‌సీయూ భద్రతా ఏర్పాట్లు, శిశువుల రక్షణ చర్యలు, అందించిన వైద్యం, విచారణ వివరాలతో నివేదిక సమర్పించాలని రాష్ట్ర ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమ శాఖను ఆదేశించింది. తదుపరి విచారణను అక్టోబర్ 27కు వాయిదా వేసింది.

## మళ్లీ కరెంట్ కోతలు

(మొదటిపేజీ తరువాయి)

అడుగంటడంతో రాష్ట్రంలోని 5 పవర్ జనరేషన్ యూనిట్లు వారం రోజులుగా మూతపడ్డాయని కేటీఆర్ తెలిపారు. సింగరేణిలో సుమారు 40 లక్షల టన్నుల బొగ్గు మాయమైందని, రూ.1,500 కోట్ల కుంభకోణం జరిగిందని ఆయన పేర్కొన్నారు. అయితే డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క బొగ్గు నిల్వలు పుష్కలంగా ఉన్నాయని చెబుతున్నారని విమర్శించారు. బొగ్గు నిల్వలు ఉన్నప్పుడు విద్యుత్ కేంద్రాలు ఎందుకు మూతపడుతున్నాయని ప్రశ్నించారు. జెన్కోకు తొలి ప్రాధాన్యతతో నాణ్యమైన మొదటి గ్రేడ్ బొగ్గు ఇవ్వాల్సి ఉండగా, నాసిరకం మూడో గ్రేడ్ బొగ్గు సరఫరా చేస్తున్నారని ఆరోపించారు. సింగరేణికి ప్రభుత్వం రూ.52 వేల కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు.

**నాసిరకం బొగ్గుతో రూ.2,900 కోట్ల నష్టం**

మూడో గ్రేడ్ బొగ్గు వినియోగంతో రాష్ట్ర ప్రభుత్వానికి రూ.2,900 కోట్ల నష్టం వాటిల్లిందని కేటీఆర్ పేర్కొన్నారు. జెన్కోకు నాసిరకం బొగ్గు సరఫరాపై మంత్రి వివేక్ వెంకటస్వామికి చెందిన పత్రికలోనే వార్తలు వచ్చాయని గుర్తు చేశారు. బొగ్గు కొరతపై కేంద్ర బొగ్గు శాఖ మంత్రి రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాశారని అన్నారు. యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ 4,000 మెగావాట్ల సామర్థ్యం కలిగి ఉండగా కేవలం 400 మెగావాట్లే ఉత్పత్తి అవుతోందని తెలిపారు. భద్రాద్రి కేంద్రంలోని 270 మెగావాట్ల ప్లాంట్ పూర్తిగా మూతపడిందన్నారు. 1980 నాటి చీకటి రోజులు మళ్లీ వచ్చాయని విమర్శించారు.

**ప్లాంట్లకు బీఆర్‌ఎస్ బృందాల పరిశీలన**

వాస్తవ పరిస్థితులను తెలుసుకునేందుకు గురువారం రాష్ట్రంలోని 6 పవర్ స్టేషన్లకు బీఆర్‌ఎస్ ప్రత్యేక బృందాలు వెళ్తాయని కేటీఆర్ తెలిపారు. యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌ను మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి నేతృత్వంలోని బృందం పరిశీలించనుంది. కొత్తగూడెం ప్లాంట్‌ను రాజ్యసభ ఫ్లోర్ లీడర్ వద్దిరాజు రవిచంద్ర బృందం, భద్రాద్రి పవర్ స్టేషన్‌ను మాజీ మంత్రి పువ్వాడ అజయ్ బృందం సందర్శించనున్నాయి. కాకతీయ ప్లాంట్‌కు ఎర్రబెల్లి దయాకర్‌రావు బృందం, సింగరేణి థర్మల్ పవర్ స్టేషన్‌కు జోగు రామన్న బృందం, సింగరేణి ప్రధాన కార్యాలయానికి కొప్పుల ఈశ్వర్ బృందం వెళ్లనున్నట్లు తెలిపారు.

**రైతులకు 24 గంటల కరెంట్ ఇవ్వాలి**

పవర్ ప్లాంట్లలో వాస్తవ పరిస్థితులను పరిశీలించి ప్రజలకు వివరిస్తామని కేటీఆర్ అన్నారు. వ్యవసాయ మోటార్లన్నీ ఆన్ చేసి పొలాలకు నీళ్లు అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బొగ్గు కొరతను వెంటనే తీర్చి నిలిచిపోయిన 5 యూనిట్లలో విద్యుత్ ఉత్పత్తిని పునరుద్ధరించాలని కోరారు. సింగరేణి సంస్థను కాంగ్రెస్ నాయకులు దెబ్బతీశారని విమర్శిస్తూ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రూ.2,900 కోట్ల ప్రజాధనం వృథా కావడానికి ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. విద్యుత్ కోతలు ఎత్తివేసి 24 గంటల కరెంట్ ఇవ్వకపోతే రైతులతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.






## గణేశ్ నిమజ్జనానికి భారీ బందోబస్తు!

(మొదటిపేజీ తరువాయి)

సూచించారు. పెద్ద విగ్రహాల నిర్వాహకులు ముందురోజే మార్గాలను పరిశీలించుకోవాలని కోరారు. అంబులెన్స్‌లకు, ఆస్పత్రులకు వెళ్లే వాహనాలకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు.

**ఫేక్ వీడియోలు.. డీజేలపై నజర్**

గణేశ్ వేడుకలకు సంబంధించి ఫేక్, పాత వీడియోలను వైరల్ చేసే వారిపై చర్యలు తప్పవని సీపీ హెచ్చరించారు. మండపాల వద్ద వల్గర్ పాటలు, డ్యాన్సులు, రీల్స్‌పై ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. డీజేలకు అనుమతి లేదని, మైకుల్లో అధిక శబ్దం చేయవద్దని సూచించారు. మహిళలు లేదా ఇతరులు అత్యవసర పరిస్థితుల్లో 112కు ఫోన్ చేయాలని అధికారులు సూచించారు. ట్రాఫిక్‌లో చిక్కుకుని ఆస్పత్రికి వెళ్లాల్సిన పరిస్థితి ఉంటే 8712660600, 9010203626 హెల్ప్‌లైన్ నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

## జూరాలకు 3 టీఎంసీల నీటి విడుదల

- నీటి ఎద్దడిపై కర్ణాటక సర్కార్ సానుకూల స్పందన
- నారాయణపూర్ నుంచి విడతల వారీగా విడుదల
- డీకే శివకుమార్‌కు రేవంత్‌రెడ్డి ఫోన్
- మంత్రుల బృందం చర్చలతో కదిలిన కర్ణాటక
- కాల్వలకు తిరిగి సాగునీటి విడుదల
- ఆందోళనలతో సర్కార్‌పై ఒత్తిడి




**కాకతీయ, తెలంగాణ బ్యూరో:** ఎల్‌నినో ప్రభావంతో నీటి ఎద్దడితో పంటలు ఎండిపోతున్నాయని ఆందోళన బాటపట్టిన జూరాల ఆయకట్టు రైతులకు ఊరట లభించింది. కర్ణాటక ప్రభుత్వం నారాయణపూర్ నుంచి జూరాలకు విడతల వారీగా 3 టీఎంసీల నీటిని విడుదల చేసేందుకు అంగీకరించింది. రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధుల చర్చలతో కర్ణాటక సీఎం డీకే శివకుమార్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో జూరాల జలాశయం కాల్వలకు అధికారులు తిరిగి సాగునీటిని విడుదల చేశారు. జూరాల ఆయకట్టు రైతుల ఆందోళనలు, రాస్తారోకోల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కర్ణాటక ప్రభుత్వంతో జరిపిన చర్చలు ఫలించాయి. మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యేలు డీకే శివకుమార్‌తో భేటీ అయ్యారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో నెలకొన్న నీటి ఎద్దడిని వివరించి నారాయణపూర్ నుంచి జూరాలకు నీటిని విడుదల చేయాలని కోరారు. దీనికి స్పందించిన డీకే శివకుమార్ విడతల వారీగా 3 టీఎంసీల నీటి విడుదలకు వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

**సీఎంల మధ్య ఫోన్ చర్చ**

మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి కర్ణాటక సీఎం డీకే శివకుమార్‌కు ఫోన్ చేసి జూరాల దిగువన ఉన్న నీటి అవసరాలను వివరించారు. ఆలమట్టి, నారాయణపూర్ నుంచి నీటి విడుదలకు ఉన్న అవకాశాలపై చర్చించారు. తెలంగాణ నుంచి మంత్రుల బృందాన్ని పంపుతున్నట్లు తెలిపారు. నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కూడా డీకేతో మాట్లాడారు. అనంతరం బెంగళూరు వెళ్లిన మంత్రుల బృందం నీటి విడుదలపై కర్ణాటక సీఎంకు విజ్ఞప్తి చేసింది. మరోసారి జరిగిన సమావేశంలో సానుకూల నిర్ణయం వెలువడింది. కర్ణాటక నిర్ణయంతో జూరాల కుడి, ఎడమ కాల్వలకు అధికారులు తిరిగి సాగునీటిని విడుదల చేశారు. ఈ నెల 14న కాల్వలకు నీటి సరఫరాను నిలిపివేయడంతో రైతులు గత వారం రోజులుగా ధర్నాలు, రాస్తారోకోలు చేపట్టారు. అన్నదాతలకు మద్దతుగా బీఆర్‌ఎస్, బీజేపీ కూడా ఆందోళనలు నిర్వహించాయి. ఈ నేపథ్యంలో కర్ణాటక ప్రభుత్వంతో జరిగిన చర్చలు ఫలించి నీటి విడుదలకు మార్గం సుగమమైంది. జూరాలకు స్వల్పంగా వరద కూడా పెరిగిందని అధికారులు తెలిపారు. జూరాల కాల్వలకు సాగునీటి విడుదల పునరుద్ధరించడంతో ఆయకట్టు రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పాలమూరు రైతుల కోసం నీటిని విడుదల చేసేందుకు అంగీకరించిన డీకే శివకుమార్‌కు సీఎం రేవంత్‌రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. రెండు రాష్ట్రాల మధ్య స్నేహభావానికి ఇది నిదర్శనమని పేర్కొన్నారు.

## ఓబీసీ కాలమ్‌పై మాట్లాడని నేతలు బీసీ ద్రోహులే

- అక్టోబర్ 4న పాలమూరు నుంచి ఢిల్లీ వరకు పోరుబాట
- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్

**కాకతీయ, హైదరాబాద్ :** దేశవ్యాప్తంగా జరుగుతున్న జనగణనలో ఓబీసీ కాలమ్ చేర్చాలని కోట్లాది మంది బీసీలు డిమాండ్ చేస్తున్నా రాజకీయ పార్టీల అధినేతలు స్పందించకపోవడం బాధాకరమని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. బీసీల డిమాండ్లపై మాట్లాడని, పోరాడని పార్టీలను, నేతలను బీసీ ద్రోహులుగా ప్రకటిస్తామని హెచ్చరించారు. రాజకీయ పార్టీలు తమ కార్యాచరణను ప్రకటించాలని డిమాండ్ చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని బీసీ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల జరిగిన జాతీయ ఓబీసీ సదస్సులో తీసుకున్న తీర్మానాలను వెల్లడించారు. అక్టోబర్ 4న మహబూబ్‌నగర్ పాలమూరులో బీసీ కులగణన పోరుబాట సమావేశం నిర్వహించి, అక్కడి నుంచి వివిధ జిల్లాలు, రాష్ట్రాల్లో ఉద్యమాన్ని విస్తరిస్తామని తెలిపారు. అక్టోబర్ 8న ఢిల్లీలో అఖిలపక్ష పార్టీల ప్రతినిధులు, సామాజికవేత్తలు, న్యాయ నిపుణులు, యూనివర్సిటీ ప్రొఫెసర్లతో సమావేశం నిర్వహిస్తామన్నారు. నవంబర్‌లో శీతాకాల పార్లమెంట్ సమావేశాల సందర్భంగా ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో లక్ష మందితో బీసీ కులగణన గర్జన నిర్వహిస్తామని ప్రకటించారు. బీసీల జనాభాకు శాస్త్రీయ గణాంకాలు అవసరమని అన్నారు. సమావేశంలో బీసీ జేఏసీ వర్కింగ్ చైర్మన్ గుజ్జ కృష్ణ, కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, తాటికొండ విక్రమ్‌గౌడ్, కనకాల శ్యాం కుర్మా, బర్ల మని మంజరి సాగర్, గూడూరు భాస్కర్, వరుణ్‌కుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ములుకనూర్‌లో రేషన్ కార్డుల పంపిణీ



**కాకతీయ, చిగురుమామిడి:** చిగురుమామిడి మండలం ములుకనూర్ గ్రామంలో ప్రభుత్వం చేపట్టిన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ సాంబారి భారతమ్మ కొమురయ్య అర్హులైన లబ్ధిదారులకు రేషన్ కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాల ప్రయోజనాలు చేరేలా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రేషన్ కార్డుల ద్వారా పేద కుటుంబాలకు నిత్యావసర సరుకులు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ పైడిపల్లి వెంకటేష్, గట్టు రేణుక, వంగల రాము, పిట్టల తిరుపతి, పందిపెల్లి కీర్తన, ఎండీ రజాక్, విజయలక్ష్మి, జెట్టి లత, సృపిత్ కుమార్, జీపీఓ బాలరాజ్, పంచాయతీ కార్యదర్శి స్వప్న, కారోబార్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ నేతలకు తొత్తులుగా పోలీసులు

- వినయ్ భాస్కర్‌పై దాడి అమానుషం
- మాజీ ఎమ్మెల్యే నన్నపనేని నరేందర్ ఆగ్రహం



**కాకతీయ, వరంగల్ ప్రతినిధి :** మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్‌పై ఎంజీఎం పర్యటన సందర్భంగా జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని వరంగల్ తూర్పు మాజీ ఎమ్మెల్యే నన్నపనేని నరేందర్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి పోలీసులు తొత్తులుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఇదే తీరు కొనసాగితే ప్రజా ఉద్యమానికి దిగాల్సి వస్తుందని హెచ్చరించారు. స్థానిక ఎమ్మెల్యే ఎక్కడికి పారిపోయారని ప్రశ్నిస్తూ, మీరు చేయాల్సిన పనులను తాము చేస్తున్నామని అన్నారు. ఎంజీఎంలో ప్రజారోగ్యాన్ని గాలికొదిలేశారని నరేందర్ విమర్శించారు. ప్రతిపక్షంగా ప్రజల సమస్యలపై ప్రశ్నించే బాధ్యత బీఆర్ఎస్‌కు ఉందన్నారు. ఆసుపత్రిలో మందుల కొరత వెంటాడుతోందని, ప్రైవేట్ వ్యవస్థ రాజ్యమేలుతోందని ఆరోపించారు. రెసిడెంట్ అధికారులు ఎక్కడున్నారని, కలెక్టర్ పర్యటనలో గైర్హాజరైన వారిపై చర్యలు ఎక్కడని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆక్సిజన్ ప్లాంట్ ఏర్పాటు చేశామని, ప్రస్తుతం దాని నిర్వహణ సరిగా లేదన్నారు. అల్ట్రా సౌండ్ పనిచేయడం లేదని, ఆరోగ్యశ్రీ అక్రమాలపై చర్యలు లేవని, ఎమర్జెన్సీ వార్డు అస్తవ్యస్తంగా ఉందని పేర్కొన్నారు. గుండె సంబంధిత వైద్యులు లేకపోవడం బాధాకరమన్నారు. ఎంజీఎం ఆసుపత్రి కంటే ప్రైవేట్ ఆసుపత్రులకే ప్రాధాన్యం ఇస్తున్నారని ఆరోపించారు.

# దాస్యం వినయ్ భాస్కర్‌కు మంత్రి ఎర్రబెల్లి పరామర్శ



**కాకతీయ, హన్మకొండ:** మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్‌ను మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు బుధవారం సాయంత్రం హన్మకొండలోని ఆయన నివాసంలో పరామర్శించారు. వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిని సందర్శించిన సందర్భంగా పోలీసుల దాడిలో దాస్యం వినయ్ భాస్కర్ గాయపడినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఆయనను కలిసిన ఎర్రబెల్లి దయాకర్‌రావు ఘటనకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వినయ్ భాస్కర్ ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు.

# పేద నిరుద్యోగ యువతకు టీఆర్‌పీ సుమార్గ్ అండ

- ఎస్సై, పీసీ, ఎఫ్‌బీఓ పరీక్షలకు ఉచిత కోచింగ్
- ఆర్థిక పరిస్థితి కాదు.. పట్టుదలే భవిష్యత్తును నిర్ణయిస్తుంది
- టీఆర్‌పీ వర్కింగ్ ప్రెసిడెంట్ మాదం రజినీకుమార్ యాదవ్ పిలుపు



**కాకతీయ, కరీంనగర్ :** పేద, మధ్యతరగతి నిరుద్యోగ యువతకు అండగా టీఆర్‌పీ సుమార్గ్ ఉచిత కోచింగ్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర కార్యదర్శి మొహమ్మద్ అఖిల్ పాషా తెలిపారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలో ఎస్సై, పీసీ, ఎఫ్‌బీఓ పోటీ పరీక్షలకు ఉచిత కోచింగ్ కార్యక్రమాన్ని బుధవారం టీఆర్‌పీ వర్కింగ్ ప్రెసిడెంట్ మాదం రజినీకుమార్ యాదవ్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాదం రజినీకుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగాలకు సరైన మార్గదర్శకత్వం, నాణ్యమైన కోచింగ్, నిరంతర సాధన అవసరమన్నారు. ప్రైవేట్ కోచింగ్ ఫీజులు భరించలేని విద్యార్థులకు అఖిల్ పాషా సొంత ఖర్చుతో ఉచిత శిక్షణ అందించడం అభినందనీయమన్నారు. క్రమశిక్షణతో చదివి, మాక్ టెస్టులు రాస్తూ లక్ష్యాన్ని సాధించాలని సూచించారు. అఖిల్ పాషా మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందుల వల్ల చదువులో తాను ఎదుర్కొన్న కష్టాలే ఉచిత కోచింగ్ ఏర్పాటుకు కారణమన్నారు. "నా పరిస్థితి కాదు.. నా పట్టుదలే నా భవిష్యత్తును నిర్ణయిస్తుంది" అనే ఆత్మవిశ్వాసంతో యువత ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పలువురు టీఆర్‌పీ నాయకులు, కార్యకర్తలు, కోచింగ్‌కు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు పాల్గొన్నారు.

# విద్యార్థుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

- మంచి ఆహారం, వసతులు, రవాణా కల్పించడం నా బాధ్యత
- విద్యతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలకు ప్రాధాన్యం
- రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



**కాకతీయ, హుస్నాబాద్ :** విద్యార్థులకు ఏ సమస్య ఉన్నా తనకు చెప్పే హక్కు ఉందని, తాను వారి గార్డియన్‌గా ఉంటానని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బుధవారం హుస్నాబాద్ శాతవాహన యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాలను ఆకస్మికంగా సందర్శించిన ఆయన కళాశాల, హాస్టల్ వసతులను పరిశీలించి విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడారు. వారి సమస్యలను స్వయంగా నోట్ చేసుకుని తక్షణమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. హాస్టల్‌లో నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారం అందించాలని, సిబ్బందిలో ఒకరు ప్రతిరోజూ విద్యార్థులతో కలిసి భోజనం చేసి నాణ్యతను పర్యవేక్షించాలని సూచించారు. విద్యార్థులతో కమిటీ ఏర్పాటు చేసి భోజనం, వసతులపై అభిప్రాయాలు తీసుకోవాలన్నారు. బాయ్స్ హాస్టల్ బాత్రూమ్ సమస్యలను పరిష్కరించాలని, బస్సు, రవాణా సమస్యలను కూడా పరిష్కరిస్తామని తెలిపారు. లైబ్రరీ సమస్యను పరిష్కరించాలని, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ లింగమూర్తి చొరవ తీసుకోవాలని కోరారు. విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్లు, సైకిళ్లు అందించడంతో పాటు టాపర్లకు ల్యాప్‌టాప్‌లు ఇస్తామని మంత్రి తెలిపారు. క్యాంపస్ సెలెక్షన్స్, ప్లేస్‌మెంట్స్ కోసం చర్యలు చేపడతామని, రిటైర్డ్ ప్రొఫెసర్లతో మోటివేషనల్ క్లాసులు నిర్వహిస్తామని చెప్పారు. గంజాయి, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, వ్యక్తిగత క్రమశిక్షణ పాటించాలని సూచించారు. 1987లో డిగ్రీ కళాశాల ప్రెసిడెంట్‌గా విద్యార్థి నాయకుడిగా తన ప్రస్థానం ప్రారంభమైందని, లక్ష్యంతో ముందుకు సాగితే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చన్నారు. విద్యార్థులకు మంచి బోధన అందించడం అధ్యాపకుల బాధ్యత, మంచిగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగడం విద్యార్థుల బాధ్యత అని పేర్కొన్నారు. కార్యక్రమంలో శాతవాహన యూనివర్సిటీ వైస్‌చాన్సలర్, రిజిస్ట్రార్, అధ్యాపకులు, లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- లోతట్టు ప్రాంతాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలి
- అంగన్వాడీ, పాఠశాలలు, కళాశాలలకు సెలవు
- చెరువులు, జలాశయాలు, వంతెనల వద్ద జాగ్రత్తలు
- అత్యవసర సహాయం కోసం ప్రత్యేక కంట్రోల్ రూమ్
- 24 గంటలు అందుబాటులో సిబ్బంది : కలెక్టర్ స్నేహ శబరిష్




**కాకతీయ,మహబూబాబాద్ :** భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ ఆదేశించారు. వాతావరణ సూచనల నేపథ్యంలో జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా సెప్టెంబర్ 24, గురువారం అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలలు, కళాశాలలకు స్థానిక సెలవు ప్రకటించినట్లు తెలిపారు. జిల్లాలోని లోతట్టు ప్రాంతాలు, వంతెనలు, చెరువులు, జలాశయాలు, రోడ్లు, పాత భవనాలు, ఇతర సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అన్ని విభాగాల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అవసరమైన చోట హెచ్చరిక సూచికలు ఏర్పాటు చేయాలని సూచించారు. భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని, విహారయాత్రలకు వెళ్లకూడదని, చెరువులు, జలాశయాల వద్దకు వెళ్లడంతోపాటు చేపల వేటకు వెళ్లవద్దని హెచ్చరించారు. వర్షాలు, వరదల వల్ల అత్యవసర సహాయం అవసరమైతే కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించాలని కలెక్టర్ సూచించారు. 24 గంటలు సిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు. కంట్రోల్ రూమ్ ఫోన్ నంబర్ 7995074803కు సమాచారం అందించాలని కోరారు. పోలీస్, రెవెన్యూ, పంచాయతీరాజ్, మున్సిపల్, ఇరిగేషన్, విద్యుత్ తదితర అన్ని శాఖల అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండి సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఎలాంటి విపత్కర పరిస్థితులు ఏర్పడినా వెంటనే స్పందించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉద్యోగులు ప్రధాన కార్యస్థానాల్లోనే అందుబాటులో ఉండాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు, వరదలు వచ్చే అవకాశం ఉన్నందున సోషల్ మీడియా, వాట్సాప్ తదితర సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజలకు విస్తృతంగా సమాచారం అందించి అప్రమత్తం చేయాలని కలెక్టర్ స్నేహ శబరిష్ అధికారులను ఆదేశించారు.

# భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- లోతట్టు ప్రాంతాలు, వంతెనల వద్ద ముందస్తు జాగ్రత్తలు
- 24 గంటలు అందుబాటులో ప్రత్యేక కంట్రోల్ రూమ్
- హనుమకొండ కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్




**కాకతీయ, హనుమకొండ:** వాతావరణ సూచనల నేపథ్యంలో జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ సూచించారు. అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకు రావొద్దని కోరారు. లోతట్టు ప్రాంతాలు, వంతెనలు, చెరువులు, జలాశయాలు, రోడ్లు, పాత భవనాలు తదితర సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అన్ని విభాగాల అధికారులను ఆదేశించారు. వర్షాలు, వరదల నేపథ్యంలో అత్యవసర సహాయం కోసం కలెక్టరేట్‌లో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. 24 గంటలూ సిబ్బంది అందుబాటులో ఉంటారని, అత్యవసర పరిస్థితుల్లో 18004251115 నంబర్‌కు సమాచారం అందించాలని సూచించారు. పోలీస్, రెవెన్యూ, పంచాయతీరాజ్, మున్సిపల్, ఇరిగేషన్, విద్యుత్ తదితర శాఖల అధికారులు సమన్వయంతో అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు. ఎలాంటి విపత్కర పరిస్థితులు ఎదురైనా వెంటనే స్పందించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.

# సుందరగిరి ఊర చెరువులో నిమజ్జనానికి ప్రత్యేక ఏర్పాట్లు

**ప్రమాదకర గుంతల చుట్టూ తాత్కాలిక ఫెన్సింగ్ ఏర్పాటు**



**కాకతీయ, చిగురుమామిడి :** వినాయక నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా సుందరగిరి ఊర చెరువులో చేపట్టే విగ్రహాల నిమజ్జనానికి గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో అన్ని ముందస్తు భద్రతా ఏర్పాట్లు చేసినట్లు సర్పంచ్ జంగ శిరీష వెంకటరమణారెడ్డి తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. గతంలో రోడ్డు నిర్మాణ పనుల కోసం జేసీబీతో చెరువులో మట్టి తీయడంతో పెద్ద పెద్ద ప్రమాదకర గుంతలు ఏర్పడ్డాయని సర్పంచ్ తెలిపారు. భక్తుల రక్షణ కోసం ఆయా గుంతల చుట్టూ గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో తాత్కాలిక రక్షణ కంచె ఏర్పాటు చేశామన్నారు. విగ్రహాల నిమజ్జనం కోసం ప్రత్యేకంగా సురక్షితమైన దారిని సిద్ధం చేశామని, ఉత్సవ కమిటీలు, భక్తులు అదే మార్గంలో వెళ్లి నిమజ్జనం పూర్తి చేసుకోవాలని సూచించారు. ఉత్సాహంతో ప్రమాదకర ప్రాంతాల వైపు వెళ్లవద్దని హెచ్చరించారు. ఎలాంటి అపశృతి జరగకుండా గ్రామంలోని కుల సంఘాల నాయకులు, యువకులు, మహిళలు, ప్రజలు సమన్వయంతో ముందస్తు జాగ్రత్తలు పాటించాలని కోరారు. భక్తిశ్రద్ధలతో నిమజ్జన వేడుకలను విజయవంతం చేయాలని సర్పంచ్, పాలకవర్గం పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ మెడబోయిన రాజు, గ్రామపంచాయతీ కార్యదర్శి గోల్లేని సంపత్, వార్డు సభ్యుడు వంతడుపుల దిలీప్‌కుమార్, నాంపల్లి శిరీషసురేష్, ఫీల్డ్ అసిస్టెంట్ తాళ్లపల్లి సత్యంగౌడ్, గ్రామస్తులు గైని తిరుపతిగౌడ్, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# గణేశ్ బందోబస్తులో గాయపడిన ఎస్సై వెంకన్న మృతి

- హైదరాబాద్‌లో రోడ్డు దాటుతుండగా ద్విచక్ర వాహనం ఢీ
- 1990 వరంగల్ బ్యాచ్‌కు చెందిన ఎస్సై వెంకన్న



**కాకతీయ, వరంగల్:** గణేశ్ బందోబస్తు విధుల్లో హైదరాబాద్‌లో రోడ్డు దాటుతుండగా అతివేగంగా వచ్చిన ద్విచక్ర వాహనం ఢీకొనడంతో గాయపడిన ఎస్సై వెంకన్న చికిత్స పొందుతూ మృతి చెందారు. 1990 వరంగల్ బ్యాచ్‌కు చెందిన వెంకన్న పదోన్నతిపై కొత్తగూడెంలో విధులు నిర్వహిస్తున్నారు. గణేశ్ నిమజ్జన బందోబస్తు విధుల కోసం హైదరాబాద్‌కు వచ్చిన సమయంలో ఈ ప్రమాదం జరిగినట్లు సమాచారం. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వెంకన్నను ఆసుపత్రికి తరలించి చికిత్స అందించినప్పటికీ పరిస్థితి విషమించడంతో మృతి చెందినట్లు తెలిసింది. అనంతరం మృతదేహాన్ని వరంగల్‌కు తరలించారు.

# మొరంపల్లి బంజరలో ఆర్నాభ్ తూఫాన్ విధ్వంసం

**కాకతీయ, బూర్గంపాడు:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం మొరంపల్లి బంజరలో ఆర్నాభ్ తూఫాన్ బీభత్సం సృష్టించింది. ఒక్కసారిగా భారీగా దుమ్ము, నల్లటి మేఘాలు కమ్ముకోవడంతో ఏం జరుగుతుందో అర్థంకాని పరిస్థితి నెలకొంది. తుపాను ధాటికి చెట్లు, రేకులు గాలిలో ఎగిరిపడ్డాయి. కొందరు వ్యక్తులు సైతం కొంతదూరం గాలికి నెట్టబడినట్లు స్థానికులు తెలిపారు. భయానక పరిస్థితిని ఎదుర్కొన్నామని బాధితులు పేర్కొన్నారు. అదృష్టవశాత్తు పలువురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు.

# వర్షాన్ని లెక్కచేయకుండా నిమజ్జన విధుల్లో

- ఆరెంజ్ అలెర్ట్ ఉన్నా విధుల్లో సిబ్బంది
- ప్రశాంతంగా, సురక్షితంగా నిమజ్జనం పూర్తి చేయాలి
- భక్తులు, నిర్వాహకులు అధికారులకు సహకరించాలి
- వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారద





**కాకతీయ, వరంగల్:** వాతావరణ శాఖ ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసినప్పటికీ వర్షాన్ని లెక్కచేయకుండా అధికారులు, సిబ్బంది వినాయక నిమజ్జన విధుల్లో నిరంతరం పనిచేస్తున్నారని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద తెలిపారు. ప్రజల భద్రతే ప్రధాన లక్ష్యంగా నిమజ్జన కార్యక్రమాలు ప్రశాంతంగా, సురక్షితంగా పూర్తయ్యేలా చర్యలు చేపట్టామని చెప్పారు. జిల్లాలో వినాయక నిమజ్జన కార్యక్రమాలు ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పూర్తయ్యేలా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారని కలెక్టర్ తెలిపారు. వర్షం కురుస్తున్న నేపథ్యంలో నిమజ్జనానికి వచ్చే భక్తులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అధికారులు సూచించే భద్రతా మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని కోరారు. నిమజ్జనానికి తీసుకొచ్చిన వినాయక విగ్రహాలను త్వరితగతిన నిమజ్జనం చేసేలా భక్తులు, నిర్వాహకులు అధికారులకు సహకరించాలని డాక్టర్ సత్య శారద విజ్ఞప్తి చేశారు. నిమజ్జన ఘట్టం వద్ద ఎక్కువ సేపు గుమిగూడకుండా, సమయాన్ని దుర్వినియోగం చేయకుండా సకాలంలో నిమజ్జనం పూర్తి చేసేందుకు సహకరించాలని కోరారు. ప్రజల భద్రత కోసం అధికారులు, సిబ్బంది నిరంతరం విధులు నిర్వహిస్తున్నారని కలెక్టర్ తెలిపారు. నిమజ్జన సమయంలో అధికారులు సూచించే మార్గదర్శకాలను పాటిస్తూ కార్యక్రమాన్ని త్వరగా పూర్తి చేయాలని సూచించారు. వర్షం నేపథ్యంలో అప్రమత్తంగా వ్యవహరించి నిమజ్జనం అనంతరం సురక్షితంగా ఇళ్లకు చేరుకోవాలని భక్తులు, ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# గ్రామాన్ని అభివృద్ధి చేయడమే ధ్యేయం

**హనుమాన్ నగర్ తండా సర్పంచి అశోక్ కుమార్**



**కాకతీయ,నెల్లికుదురు :** మండలంలోని హనుమాన్ నగర్ తండా గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి అభివృద్ధి చేయడమే ధ్యేయంగా పనిచేస్తామని సర్పంచి గుగులోతు అశోక్ కుమార్ స్పష్టం చేశారు. మండలంలోని హనుమాన్ నగర్ తండాలో సర్పంచ్ అశోక్ కుమార్ అధ్యక్షతన బుధవారం గ్రామసభ నిర్వహించారు.ఈ సందర్భంగా తండా పరిధిలోని వివిధ తండాలలోని సమస్యలను సభ దృష్టికి తీసుకురాగా అన్ని సమస్యల పరిష్కారానికి అన్ని విధాలుగా ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. చెర్లలక్ష్మి తండాలో కరెంటు,రోడ్డు సమస్య గ్రామ సభ దృష్టికి తీసుకురాగా స్తంభాలు త్వరలోనే వేయించి లైన్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రోడ్డు సమస్య కూడా ఎమ్మెల్యేతో పాటు అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పనిచేసేందుకు ప్రయత్నం చేస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు కోసం దాతల నుంచి స్థలం సేకరించే ప్రయత్నం చేస్తున్నామని వివరించారు. పల్లెదవాఖాన మంజూరు కాగానే హనుమాన్ నగర్ తండాలోనే ఏర్పాటు చేయాలని కోరగా ఆ సమస్యను కూడా అందరితో కలిసి సమన్వయంతో పరిశీలిద్దామని సర్పంచి చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఆంజనేయులు, ఉపసర్పంచి శ్రీలత యాకు, వార్డు సభ్యులు సోమ్లు,రఘుపతి,రజిత,సక్కు, రమ్య,రవి తండావాసులు పాల్గొన్నారు.

# వర్ధన్నపేట ఆస్పత్రి సూపరింటెండెంట్ స్వచ్ఛంద రాజీనామా

- కలెక్టర్‌కు మానవ హక్కుల కమిషన్ నోటీసులు
- బాధ్యత వహిస్తూ సూపరింటెండెంట్ స్వచ్ఛంద రాజీనామా
- తాత్కాలిక ఇన్‌చార్జిగా డాక్టర్ భరత్.. డాక్టర్ వీరిన్

**కాకతీయ, వర్ధన్నపేట :** వరంగల్ జిల్లా వర్ధన్నపేట ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి మార్చురీలో ఫ్రీజర్ సౌకర్యం లేకపోవడంతో మృతదేహాన్ని ఎలుకలు కొరికిన ఘటన కలకలం రేపింది. పోస్ట్‌మార్టం గది నిర్వహణలో తీవ్ర నిర్లక్ష్యం వహించారంటూ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారదకు మానవ హక్కుల కమిషన్ నోటీసులు జారీ చేసింది. ఈ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వీరిన్ తన పదవికి స్వచ్ఛందంగా రాజీనామా చేసినట్లు విశ్వసనీయ సమాచారం. ఘటనపై విమర్శలు వెల్లువెత్తడం, ఉన్నతాధికారుల నుంచి ఒత్తిడి పెరగడంతో ఆయన ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. దీంతో జిల్లా వైద్యాధికారి డాక్టర్ రామ్మూర్తి వెంటనే స్పందించి డాక్టర్ భరత్‌ను తాత్కాలిక ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు సమాచారం. ఫ్రీజర్ సౌకర్యం లేకపోవడం, మార్చురీ నిర్వహణలో లోపాలపై ప్రభుత్వం విచారణకు ఆదేశించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

# హైనా దాడిలో లేగదూడ మృతి



**కాకతీయ, చిగురుమామిడి:** కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం గాగిరెడ్డిపల్లెకు చెందిన రైతు మొలుగురి రవీందర్ వ్యవసాయ క్షేత్రంలోని షెడ్డులో కట్టేసిన ఏడాదిన్నర వయసున్న లేగదూడపై బుధవారం తెల్లవారుజామున హైనా దాడి చేసి హతమార్చింది. దూడ మృతితో రైతు కన్నీరుమున్నీరుగా విలపించారు. దాని విలువ సుమారు రూ.20 వేలు ఉంటుందని తెలిపారు. ఘటనపై రవీందర్ అటవీశాఖ, పశువైద్యాధికారులకు సమాచారం ఇచ్చారు. ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ సమీనా సంఘటనా స్థలానికి చేరుకుని పరిసరాలు, పాదముద్రలను పరిశీలించి రైతును ఓదార్చారు. సర్పంచ్ సన్నీళ్ల కవిత వెంకటేశం రైతును పరామర్శించి ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని కోరారు. బాధితుడికి పరిహారం అందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆర్థికంగా ఆదుకోవాలని రైతు రవీందర్ ప్రభుత్వాన్ని కోరారు.

# దివ్యాంగులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

**దుగ్గొండి ఎస్ఐ రణధీర్‌రెడ్డి**

**కాకతీయ, దుగ్గొండి:** దివ్యాంగులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధి పొందాలని దుగ్గొండి ఎస్ఐ రణధీర్‌రెడ్డి సూచించారు. బుధవారం మండల సమాఖ్య కార్యాలయంలో ఎం.పి.ఆర్.డి. ఇండియా సభ్యులకు పీఎం ముద్ర యోజన, ఉద్యం రిజిస్ట్రేషన్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రణధీర్‌రెడ్డి మాట్లాడుతూ దివ్యాంగులు తమ ప్రతిభను గుర్తించి స్వయం ఉపాధి దిశగా ముందుకు సాగాలన్నారు. పీఎం విశ్వకర్మ, పీఎం ముద్ర యోజన, పీఎం స్వనిధి పథకాలను వినియోగించుకోవాలని సూచించారు. పరిశ్రమల శాఖ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ సెంటర్ మేనేజర్ శ్రీలత, అసిస్టెంట్ మేనేజర్ సందీప్‌కుమార్ పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో చింత కుమారస్వామి, డాక్టర్ ఆకులపల్లి మధు, అడ్డా రాజు, కందికొండ రాజకుమార్, యారా శ్రీను, కరుణాకర్, ఎల్లస్వామి, సుమలత తదితరులు పాల్గొన్నారు.




# విద్య, వైద్యం అందించే వారికే ఓటు వేయాలి

- పశ్చిమలో ఎమ్మెల్యే నాయినినా.. ఆయన అల్లుడా
- ఆంధ్ర నుంచి వచ్చి తెలంగాణలో బెదిరింపులు
- ఎంజీఎం ఘటనపై నాయిని ప్రజలకు సమాధానం చెప్పాలి
- బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు దుగ్గంపూడి రంజిత్‌రెడ్డి



**కాకతీయ, హన్మకొండ :** పేద, ధనిక అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరికీ నాణ్యమైన ఉచిత విద్య, వైద్యం అందించే వారినే ప్రజాప్రతినిధులుగా ఎన్నుకోవాలని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు దుగ్గంపూడి రంజిత్‌రెడ్డి అన్నారు. ఎన్నికల్లో ఉచిత విద్య, వైద్యం అందించే వారికే ఓటు వేస్తామని ప్రజలు ఖరాకండిగా చెప్పాలని సూచించారు. బుధవారం హనుమకొండలో ఓ ప్రయివేటు హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రంజిత్‌రెడ్డి మాట్లాడారు. కొంతకాలంగా ఉచిత విద్య, వైద్యం ప్రభుత్వాలు అందించాలనే నినాదంతో ప్రజలను చైతన్యపరిచేందుకు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డినా.. ఆయన అల్లుడా అనే అనుమానాలు ప్రజల్లో తలెత్తుతున్నాయని రంజిత్‌రెడ్డి ఆరోపించారు. ఎమ్మెల్యే అల్లుడు అధికారులకు ఆదేశాలు ఇస్తూ వాటిని సోషల్ మీడియాలో ప్రచారం చేసుకుంటున్నారని అన్నారు. తన మాట వినని యువకులపై కేసులు పెట్టిస్తున్నారని, ఆంధ్ర నుంచి వచ్చిన వ్యక్తి తెలంగాణలో బెదిరింపులకు పాల్పడుతున్నారని విమర్శించారు.

**భూకబ్జాలపై సవాల్**

నగరంలో భూకబ్జాలకు ప్రత్యేకంగా ఓ టీంను ఏర్పాటు చేసుకుని వారి ఆధ్వర్యంలో భూకబ్జాలు చేస్తున్నారని రంజిత్‌రెడ్డి ఆరోపించారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి తనపై చేసిన విమర్శలు నిజమని నిరూపిస్తే దేనికైనా సిద్ధమని సవాల్ విసిరారు. తాను కుటుంబంతో ప్రమాణం చేస్తానని, ఎమ్మెల్యే కూడా తన కుటుంబంపై ప్రమాణం చేయాలని అన్నారు. ఆధారాలతో విమర్శలు చేస్తే వాటిని ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నానని చెప్పారు. ప్రజల సమస్యలు తెలుసుకోవాల్సిన ఎమ్మెల్యే నిత్యం పేదలు వైద్యం పొందుతున్న ఎంజీఎం ఆసుపత్రిని సందర్శించి సమస్యలు పరిష్కరించాల్సిందిపోయి, సమస్యలను తెలుసుకునేందుకు వెళ్లిన మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్‌పై దాడి జరగడం హేయమైన చర్య అని రంజిత్‌రెడ్డి అన్నారు. ఆసుపత్రిని సందర్శించిన వారిపై కేసులు పెట్టడం దారుణమని పేర్కొన్నారు. నాయిని రాజేందర్‌రెడ్డి పద్ధతి మార్చుకోవాలని, ఆధారాలు లేని ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగ స్ఫూర్తితో ప్రతి ఒక్కరికీ సమానంగా నాణ్యమైన ఉచిత విద్య, వైద్యం అందాల్సిన అవసరం ఉందని రంజిత్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వాలు ఈ రంగాలకు ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రజలు తమ ప్రాథమిక హక్కులపై ప్రశ్నించాలని సూచించారు. ఎన్నిక ఏదైనా ఉచిత విద్య, వైద్యం అందించే వారికి ఓటు వేస్తామని ప్రజలు స్పష్టంగా చెప్పాలని పిలుపునిచ్చారు.

# లింగ నిర్ధారణ చేస్తే జైలు శిక్ష తప్పదు

- నిబంధనలు ఉల్లంఘిస్తే ఆసుపత్రులపై కఠిన చర్యలు
- టారిఫ్ బోర్డు ప్రకారమే ఫీజులు వసూలు చేయాలి
- జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ బి. రాజారెడ్డి
- సంరక్ష సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో ఆకస్మిక తనిఖీ
- రికార్డులు, ఫైర్ సేఫ్టీ, బయోమెడికల్ వ్యర్థాలపై పరిశీలన



**కాకతీయ, వరంగల్ ప్రతినిధి :** జిల్లాలో నిబంధనలు పాటించని ప్రైవేట్ ఆసుపత్రులపై కఠిన చర్యలు తప్పవని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ బి. రాజారెడ్డి హెచ్చరించారు. ఆసుపత్రుల్లో రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంతోపాటు ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా అమలు చేయాలని స్పష్టం చేశారు. వరంగల్ పట్టణంలోని సంరక్ష సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని మంగళవారం డీఎంహెచ్‌వో ఆకస్మికంగా తనిఖీ చేశారు. తెలంగాణ క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ యాక్ట్ 2010, రూల్స్ 2022 ప్రకారం నిబంధనల అమలు తీరును పరిశీలించారు. ఆసుపత్రి రికార్డులు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అనుమతులు, బయోమెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ధ్రువపత్రాలు, ఎస్‌టీపీ, ఫైర్ సేఫ్టీ ఏర్పాట్లను తనిఖీ చేశారు. డయాగ్నస్టిక్స్ విభాగం, జనరల్ వార్డులు, ఐసీయూలను పరిశీలించిన డాక్టర్ బి. రాజారెడ్డి, రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. అవసరమైన డయాగ్నస్టిక్ పరీక్షలను మాత్రమే నిర్వహించాలని ఆసుపత్రి యాజమాన్యానికి సూచించారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని స్పష్టం చేశారు.

**టారిఫ్ బోర్డు ప్రకారమే వసూళ్లు**

టారిఫ్ బోర్డులో ప్రదర్శించిన ఫీజుల మేరకే రోగుల నుంచి ఛార్జీలు వసూలు చేయాలని డీఎంహెచ్‌వో ఆదేశించారు. జిల్లాలోని అన్ని ప్రైవేట్ ఆసుపత్రులు ఫైర్ సేఫ్టీ, బయోమెడికల్ వేస్ట్ నిర్వహణ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. ఆసుపత్రిలో అందిస్తున్న సేవలు, టారిఫ్ బోర్డు, వైద్యుల వివరాలను రిసెప్షన్ వద్ద స్పష్టంగా ప్రదర్శించాలని ఆదేశించారు. స్కానింగ్ కేంద్రాలు పీసీపీఎన్‌డీటీ యాక్ట్ 1994 ప్రకారం తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని డాక్టర్ బి. రాజారెడ్డి తెలిపారు. గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చేయడం చట్టవిరుద్ధమని స్పష్టం చేశారు. లింగ నిర్ధారణ చేసినా, ప్రోత్సహించినా, చేయమని కోరినా రూ.10 వేల నుంచి రూ.50 వేల వరకు జరిమానాతోపాటు 3 నుంచి 5 ఏళ్ల వరకు జైలు శిక్ష పడే అవకాశం ఉందని హెచ్చరించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే ఆసుపత్రులు, స్కానింగ్ కేంద్రాలపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ తనిఖీలో స్టాటిస్టికల్ ఆఫీసర్ ప్రసన్నకుమార్, డిప్యూటీ డెమో వెంకటేశ్వర్లు, ఎల్‌డీ కంప్యూటర్ నాగరాజు పాల్గొన్నారు.

# మృతురాలి కుటుంబానికి చాడ వెంకటరెడ్డి పరామర్శ



**కాకతీయ, చిగురుమామిడి :** కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం సుందరగిరికి చెందిన తాళ్లపల్లి మల్లవ్వ ఇటీవల మృతి చెందడంతో ఆమె కుమారులు మాజీ ఆలయ చైర్మన్ తాళ్లపల్లి రాజయ్యగౌడ్, సీపీఐ సీనియర్ నాయకుడు, మాజీ సింగిల్ విండో డైరెక్టర్ తాళ్లపల్లి చిన్నచంద్రయ్య, కుటుంబ సభ్యులను సీపీఐ జాతీయ నేత, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి బుధవారం పరామర్శించారు. మల్లవ్వ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, కుమారులను ఓదార్చారు. మల్లవ్వ మృతి బాధాకరమని, కుటుంబానికి తీరని లోటని చాడ వెంకటరెడ్డి అన్నారు. సంతాపం, సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు, మాజీ జెడ్పీటీసీ అందె స్వామి, జిల్లా కౌన్సిల్ సభ్యులు చాడ శ్రీధర్‌రెడ్డి, అందె చిన్నస్వామి, ముద్రకోల రాజయ్య, గోలీ బాపురెడ్డి, తాళ్లపల్లి సంపత్‌గౌడ్, తాళ్లపల్లి తిరుపతిగౌడ్, తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్, సీపీఐ గ్రామశాఖ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## నిమజ్జనంలో విధ్వంసం చేస్తానంటూ వార్నింగ్..!




**కాకతీయ, రుద్రంగి:** వినాయక నిమజ్జనం సందర్భంగా శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా సోషల్ మీడియాలో బెదిరింపు వాయిస్ మెసేజ్ వైరల్ చేసిన మోతే నితిన్ (24)ను రుద్రంగి పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. నిమజ్జనం సందర్భంగా లా అండ్ ఆర్డర్ సమస్య సృష్టిస్తానని, తనతో గొడవ పెట్టుకున్న వారిని చంపుతానంటూ నితిన్ బెదిరింపులకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. రుద్రంగి ఎస్సై మోతీరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బుధవారం అంబేద్కర్ విగ్రహం వద్ద అనుమానాస్పదంగా కనిపించిన నితిన్‌ను అదుపులోకి తీసుకుని, బెదిరింపు వాయిస్ మెసేజ్ రికార్డు చేసేందుకు ఉపయోగించిన సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. చందుర్తి సీఐ కె.రవీందర్ మాట్లాడుతూ సోషల్ మీడియా, వాట్సాప్ గ్రూపుల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా చట్టవ్యతిరేక సందేశాలు, బెదిరింపులు, రెచ్చగొట్టే పోస్టులు చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. పండుగల వేళ ప్రజలు సంయమనం పాటించి పోలీసులకు సహకరించాలని సూచించారు.

# మాజీ ఎమ్మెల్యే వినయ్ భాస్కర్‌పై కేసు

- ఎంజీఎంలో పోలీసులకు విధులకు ఆటంకం
- దాడికి పాల్పడ్డారంటూ ఎస్ఐ బి.శ్రీనివాస్ ఫిర్యాదు
- ఎంజీఎం ఆస్పత్రి ఘటనలో కీలక పరిణామం

**కాకతీయ, వరంగల్ ప్రతినిధి :** వరంగల్ ఎంజీఎం ఆసుపత్రి వద్ద బందోబస్తు విధుల్లో ఉన్న పోలీసుల విధులకు ఆటంకం కలిగించి, దాడికి పాల్పడ్డారంటూ బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్‌తో పాటు పలువురు కార్యకర్తలపై మట్టెవాడ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ బి.శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు సీఆర్ నంబర్ 515/2026, బీఎన్‌ఎస్‌లోని 132, 121(1), 329(3), 126(2), 351(2), 189(2), 3/4 190 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఫిర్యాదు ప్రకారం.. సెప్టెంబర్ 22న మధ్యాహ్నం వినయ్ భాస్కర్‌తో పాటు ప్రసాద్, సదత్ రమేష్, పోలెపాక రామ్మూర్తి, బైరపాక ప్రశాంత్, భాజా, ప్రణయ్, నయుం, దర్శన్ సింగ్, పస్తం అనిల్, యూసుఫ్, సృజన్‌తో పాటు మరికొందరు బీఆర్‌ఎస్ కార్యకర్తలు మార్చురీ గేట్ వద్దకు వచ్చి ఆసుపత్రిలోకి వెళ్లేందుకు ప్రయత్నించారు. అనుమతి లేకుండా లోపలికి వెళ్లవద్దని పోలీసులు చెప్పినా వినకుండా తమ విధులకు ఆటంకం కలిగిస్తూ తోపులాటకు పాల్పడ్డారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ క్రమంలో ఎస్ఐ శ్రీనివాస్ జబ్బపై వినయ్ భాస్కర్ గుద్దినట్లు, ఎం.డి.అలీ, బి.వినయ్, ఏ.సాయికుమార్‌లకు స్వల్ప గాయాలైనట్లు తెలిపారు. అనంతరం జిమినీ జంక్షన్ వద్ద రోడ్డు బ్లాక్ చేసి సుమారు 30 నిమిషాలు ధర్నా చేసినట్లు పేర్కొన్నారు. దీంతో హనుమకొండ ఏసీపీ నరసింహారావు, ఇన్‌స్పెక్టర్ కర్ణాకర్, ఎస్ఐ శివకృష్ణ, క్రైమ్స్ ఏసీపీ సదయ్య అక్కడికి చేరుకుని వారిని రోడ్డుపై నుంచి పంపించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# కాంగ్రెస్‌కు సుజాత సేవలు చిరస్మరణీయం

- పార్టీ బలోపేతానికి ఎనలేని సేవలందించారు
- దుర్గపు సుజాత కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి
- రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ నివాళి

**కాకతీయ, శంకరపట్నం :** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు, తాడికల్ గ్రామ సర్పంచ్ దుర్గపు సుజాత కుటుంబాన్ని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ బుధవారం పరామర్శించారు. తాడికల్‌లోని ఆమె నివాసానికి వెళ్లిన మంత్రి సుజాత చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి దుర్గపు సుజాత ఎనలేని సేవలందించారని మంత్రి గుర్తుచేశారు. పార్టీ పట్ల అంకితభావంతో పనిచేసిన ఆమె సేవలు ఎప్పటికీ గుర్తుండిపోతాయని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు గ్రామాభివృద్ధికి ఆమె చేసిన కృషి అభినందనీయమన్నారు. అనంతరం సుజాత కుమారుడు, కుమార్తె చదువుల వివరాలను మంత్రి అడిగి తెలుసుకున్నారు. వారు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బండారి తిరుపతి, మాజీ జెడ్పీటీసీ బత్తిని శ్రీనివాస్‌గౌడ్, బసవయ్యగౌడ్, స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# సీఎం రేవంత్‌కు రైతుల గోస కనిపించదా?

- వర్షా కాలంలో ఉపాధి హామీ పనులా..
- నీళ్లు లేక పంటలు ఎండిపోతున్నా పట్టించుకోరా?
- సాగునీరు అందక వందల ఎకరాలు బీడుగా మారుతున్నాయి
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



**కాకతీయ, దేవరుప్పుల:** కాంగ్రెస్ ప్రభుత్వానికి చేతకాకపోతే గద్దె దిగిపోవాలని, రైతులు గోస పడుతున్నా పట్టించుకోని ప్రభుత్వానికి తగిన మూల్యం తప్పదని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. దేవరుప్పుల మండలం బంజార గ్రామంలో రోడ్డు పక్కన చెరువులో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలను ఆయన కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలంలో ఉపాధి హామీ పనులు చేయించడం ప్రభుత్వ మూర్ఖత్వ పాలనకు నిదర్శనమన్నారు. కూలీలు మాట్లాడుతూ సాగునీరు అందక పంటలు వేసుకోలేకపోయామని, వేసుకున్న పంటలు నీళ్లు లేక ఎండిపోతున్నాయని, చేసేదేమీ లేక ఉపాధి హామీ పనులకు వస్తున్నామని తెలిపారని ఎర్రబెల్లి పేర్కొన్నారు. చెరువులకు సాగునీరు అందించాలని, కళ్లముందే వందల ఎకరాలు సాగు చేయకుండా రైతులు పొలాలను పక్కన పెట్టారని అన్నారు. వరి సాగు చేసిన రైతుల పంటలు కూడా నీరు లేక ఎండిపోతున్నాయని తెలిపారు. మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ రైతులను మోసం చేస్తోందని ఎర్రబెల్లి విమర్శించారు. రైతుబంధు, పంట రుణమాఫీ సక్రమంగా అమలు కాలేదని, యూరియా కొరత, విద్యుత్ సమస్యలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. రైతు బీమాపైనా మోసం చేసే కుట్ర జరుగుతోందని విమర్శించారు. సాగునీరు విడుదల చేసి రైతులను ఆదుకోవాలని, లేకపోతే రైతుల పక్షాన పోరాటాన్ని ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ దేవరుప్పుల మండల నాయకులు, రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

Printed and published owned by kiran goud arelli be half of amulya publications & printers graphics. printed at hanamkonda and published at H No. 5-12-42, pvr residency, hanuman nagar, hanamkonda- 506009- EDITOR- ARELLI KIRAN GOUD - RNI NO. TG TEL/25/A1234 - contact - 7396604266